క్లుప్తంగా

నేడు బ్రెయిన్ హెల్త్ వాక్

గుంటూరు మెడికల్: వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ గుంటూరుశాఖ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో ఆదివారం ఉదయం 6 గంటలకు బ్రెయిన్ హెల్త్ వాక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ డాక్టర్ పమిడిముక్కల విజయ తెలిపారు. బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం నుంచి గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్ వరకు ర్యాలీ కొనసాగుతోందని పేర్కొన్నారు. బ్రెయిన్ హెల్త్ వాక్‌లో గుంటూరు నగరానికి చెందిన న్యూరాలజిస్టులంతా పాల్గొనాలని ఆమె కోరారు.

నగరపాలక సంస్థ మేనేజర్‌గా బాలాజీ బాషా

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ మేనేజర్‌గా బాలాజీ బాషాను నియమిస్తూ కమిషనర్ పులి శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం ఇప్పటి వరకు మేనేజర్‌గా పనిచేసిన ఎస్ఎన్ ప్రసాద్‌ను కమిషనర్ పేషీకి, అడిషనల్ ఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న జె. రామారావును ఉపా సెల్ పీఓగా, మరికొంత మందికి స్థాన చలనం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జీజీహెచ్ ఈఎన్‌టీ వైద్యుడిపై ఫిర్యాదు

గుంటూరు మెడికల్: తనపై ఈఎన్‌టీ వైద్యుడు దురుసుగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స కోసం వచ్చిన ఓ యువతి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసింది. సెక్రటేరియట్‌లోని ఉన్నతాధికారి ఒకరు కుమార్తెకు ఈఎన్‌టీ సమస్య రావడంతో గుంటూరు జీజీహెచ్‌కు శనివారం పంపించారు. ఓపీ విభాగంలో వైద్యుడు చికిత్స చేసే సమయంలో ఆమెపై దురుసుగా ప్రవర్తించాడని యువతి ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసింది. ఈవిషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఈఎన్‌టీ వైద్యుడిపై యువతి ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని తెలిపారు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వకపోవడంతో ఈఎన్‌టీ వైద్యుడిని మందలించామని వెల్లడించారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం ప్రత్యేక కౌంటర్లు

కొరిటెపాడు: గుంటూరు సర్కిల్ పరిధిలో విద్యుత్ బిల్లులు చెల్లించే వారి కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ కె.వి.ఎల్.ఎన్.మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం కూడా విద్యుత్ బిల్లులు చెల్లించేలా కౌంటర్లు పని చేస్తాయని వెల్లడించారు. సర్కిల్ పరిధిలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇంటి నుంచే నేరుగా మొబైల్లో ఏపీసీపీడీసీఎల్ కస్టమర్ యాప్, ఫోనే పే, గూగుల్ పేల నుంచి కూడా బిల్లులు చెల్లించవచ్చని సూచించారు.

గాయకుడు స్టాలిన్ బాబుకు నివాళి



లక్ష్మీపురం: గాయకుడు స్టాలిన్ బాబు మృతి తీరనిలోటని మహతీ స్వరసుధ కోఆర్డినేటర్ మదన్‌మోహన్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో స్టాలిన్‌బాబు సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్టాలిన్ బాబుకు చదువు లేక పోయినా ఘంటసాల పాటలను మక్కికి మక్కీగా పాడుతూ మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలల క్రీడోత్సవం



గుంటూరు ఎడ్యుకేషన్: జీకేఆర్ హైస్కూల్ పట్టాభిపురం, ఏటీ అగ్రహారం క్యాంపస్‌లలో శనివారం బాలల క్రీడోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు జి.కొండారెడ్డి, జి.జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడోత్సవాలను ప్రారంభించామని చెప్పారు. ఇందులో భాగంగా వచ్చే నెల 13వ తేదీ వరకు విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. క్రికెట్, కబడ్డీ, స్కిప్పింగ్, ఖో-ఖో, స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్స్ తదితర క్రీడలతో పాటు స్పెల్‌బీ, వ్యాసరచన, వక్తృత్వ, జనరల్ నాలెడ్జ్, తెలుగు పద్యాలు, నీతి కథలు, పొడుపు కథలు, గణిత, సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. నవంబర్ 14 వరకు పెద్దఎత్తున పోటీలను నిర్వహిస్తూ, విద్యార్థులను ఉత్సాహ పరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ శైలజ, సునీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవుట్ పోస్టలు (అవుట్ పోస్టులు)

- నగరంలో నిరుపయోగంగా పోలీస్ ఔట్ పోస్టులు
- వివిధ అవసరాలకు వాడుకుంటున్న వ్యాపారులు
- పట్టించుకోని పోలీసు ఉన్నతాధికారులు

పట్నంబజారు: ఆపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అత్యవసర సహాయం అందించేందుకు నగరంలో ఏర్పాటు చేసిన పోలీసు ఔట్ పోస్టులు నిరుపయోగంగా మారాయి. అత్యవసర తనిఖీలు, ఆయా ప్రాంతాల్లో సమాచారం సేకరణ, ఇబ్బందికర పరిస్థితుల్లో పోలీసు ఔట్ పోస్టులు ఎంతో కీలకం. అయితే అధికారుల అలసత్వం, సిబ్బంది నిర్లక్ష్యంతో కనీస నిర్వహణకు నోచుకోవడం లేదు. ఉన్నతాధికారులు, ఆయా స్టేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలకు ఉపయోగపడాల్సిన ఔట్ పోస్టులు శిథిలావస్థకు చేరుతున్నాయి. **వెంటనే ఉన్నతాధికారులు స్పందించి అందుబాటులోకి తీసుకుని రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.**

యథేచ్ఛగా ఇతర అవసరాలకు వాడకం

■ ఇటీవల చౌత్రా సెంటర్‌లో ఒక వృద్ధురాలిపై దాడి చేసి ఒక గుర్తు తెలియని ఆగంతకుడు బంగారాన్ని ఎత్తుకుపోయాడు. చౌత్రా సెంటర్‌లో ఉన్న ఔట్ పోస్ట్‌కు అతీ సమీపంలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. పైగా పక్కనే ఉన్న టీ స్టాల్ వ్యక్తి సామాన్లను ఇందులో భద్రపరుచుకుంటున్నాడు.

■ పాతగుంటూరు పోలీసుస్టేషన్ పరిధిలోని కాకాని రోడ్డులో ఉన్న అవుట్ పోస్టు శిథిలావస్థకు చేరింది. గతంలో సంచలనం సృష్టించిన బీటెక్ విద్యార్థిని రమ్య హత్య కూడా ఈ ప్రాంతంలోనే జరిగింది. ఈ సమయంలో పోలీసులు ఉండి ఉంటే.. పరిస్థితి ఎలా ఉండేదో ! దానికి తగ్గట్లు ఔట్‌పోస్టు సమీపంలోనే పలు కళాశాలలు, వ్యాపార సముదాయాలు ఉండటంతో ఆకతాయిలు నిత్యం విద్యార్థినులను ఏడిపిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. పలుమార్లు కాకాని రోడ్డులో చైన్ స్నాచింగ్‌లు జరిగిన సందర్భాలు లేకపోలేదు. ==కొత్తపేట పోలీసుస్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్ 1వ లైనులో ఉన్న ఔట్‌పోస్ట్ పరిస్థితి దారుణంగా ఉంది. స్థానికంగా ఉండే **వ్యాపారులు సామాన్లు దాచుకునేందుకు, వీధి కుక్కలు పడుకునేందుకు ఉపయోగపడుతోంది.**

■ **ఈ స్టేషన్ పరిధిలోని నాజ్ సెంటర్‌లో గతంలో ఉండాల్సిన అవుట్ పోస్టు అసలు ఏమైపోయిందో** తెలియని పరిస్థితి. ఆ ప్రాంతాల సమీపంలోని పలు పూలకొట్లు, ఆయా దుకాణాల ఏర్పాటు చేసిన సమయంలో నిర్వీర్యం అయిందని చెబుతున్నారు.

■ పట్టాభిపురం పోలీసుస్టేషన్ పరిధిలోని గుజ్జనగుండ్ల సెంటర్‌లో ఉన్న ఔట్ పోస్టు సంగతే ఇక చెప్పాల్సిన పని లేదు. ఆ ప్రాంతంలో బార్ అండ్ రెస్టారెంట్లు ఉండటం, నిత్యం ఘర్షణలు జరగటం పరిపాటే. ఆ ఔట్‌పోస్ట్‌ను ఆనుకునే జనసేన పార్టీ జెండా దిమ్మెను ఏర్పాటు చేశారంటే పోలీసులు ఏ మాత్రం పట్టించుకుంటున్నారో అర్థం చేసుకోచ్చు.

■ అరండల్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలోని శారాదా కాలనీ ఆర్చి వద్ద ఏర్పాటు చేసిన అవుట్ పోస్టు లోనూ సిబ్బంది కరువయ్యారు.

■ నగరంపాలెం పోలీసుస్టేషన్ పరిధిలోని బోరింగ్ పంపు సెంటర్‌లో ఉన్న అవుట్ పోస్ట్ పరిస్థితి దారుణంగా ఉంది. అత్యవసర సమయాల్లో ప్రజలకు **ఇబ్బంది కలిగితే.. అడ్డుకునేందుకు ఉండాల్సిన సిబ్బంది లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.**



నెహ్రూనగర్ సెంటర్లలో ఔట్ పోస్టు పరిస్థితి

సిబ్బందికీ అవసరమే..

నగరంలో నిరుపయోగంగా మారిన పోలీసు అవుట్ పోస్టులు సిబ్బందికి కూడా అవసరమే. పగలు, రాత్రీ అని తేడా లేకుండా విధులు నిర్వర్తించే పోలీసులు **కొద్దిసేపైనా విశ్రాంతి తీసుకునేందుకు, కనీసం నిలువ నీడలో కూర్చునేందుకు, అర్ధరాత్రి చలిలో సంరక్షణకు ఎంతగానో అవుట్ పోస్టు భవనాలు మేలు చేస్తాయి. ఎంతో అవసరమైన వీటిని అందుబాటులోకి తీసుకుని రావాల్సిన అవసరం ఉంది.**



నగరంలోని కాకాని రోడ్డు, గుజ్జనగుండ్ల, చౌత్రా సెంటర్లలో ఔట్ పోస్టుల పరిస్థితి

సమాజంలో న్యాయవాదుల పాత్ర కీలకం

ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి



న్యాయవాది అనిల్‌కుమార్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, నేతలు

పట్నంబజారు: సమాజంలో న్యాయవాదుల పాత్ర అత్యంత కీలకమని శాసనమండలి సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన న్యాయవాది, పార్టీ లీగల్ విభాగం సభ్యుడు పచ్చల అనిల్‌కుమార్‌ను శనివారం కోబాల్ట్‌పేటలోని ఆయన నివాసంలో పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా నిలిచేందుకు పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. నిస్వార్థంగా పార్టీ కోసం పనిచేసిన న్యాయవాది అనిల్‌కు అన్ని విధాలుగా అండగా నిలవడం తమ బాధ్యతని పేర్కొన్నారు అనంతరం ఇటీవల వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గుంటూరు పర్యటనలో భాగంగా జనం ఒత్తిడిలో జారి గాయపడిన పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి వంగ సీతారామిరెడ్డిని జొన్నలగడ్డలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ రాష్ట్ర నేత పోలూరి వెంకటరెడ్డి, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి), నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, నూనె ఉమామహేశ్వరరెడ్డి, పలువురు పార్టీ డివిజన్ అధ్యక్షులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

బాలల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

నగరంపాలెం: బాలల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం పోలీస్ అధికారులు, బాలల సంక్షేమ అధికారులు, ప్రత్యేక జువెనైల్ పోలీస్ యూనిట్స్ సభ్యులకు జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో శిక్షణ నిర్వహించారు. సంస్థ కార్యదర్శి టి.లీలావతి అధ్యక్షత వహించారు. పల్నాడు ఏఎస్పీ లక్ష్మీపతి, గుంటూరు డీఎస్పీ డీవీ సుబ్బారావు మాట్లాడుతూ ప్రత్యేక జువెనైల్ చట్టం నిబంధనలను అమలు చేసే విధానాన్ని తెలుసుకోవాలని సూచించారు. విచారణ ప్రక్రియలో పోలీసుల పాత్ర, ఆస్తులు స్వాధీనంలో చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోలీసుల సందేహాలను పీపీ ఎస్.సుకుమార్, డీసీపీఓ సీహెచ్.విజయ్‌కుమార్, క్రాఫ్ సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ ప్రాన్సిస్ తంబి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ప్రమీల, నాల్గవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) గుంటూరు-కం- ప్రిన్సిపాల్ మేజిస్ట్రేట్ జువెనైల్ జస్టిస్ బోర్డు వి.నవ్యశ్రీ , నాల్గవ అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్‌బాబు నివృత్తి చేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, ట్రైనీ న్యాయమూర్తులు , పోలీస్ అధికారులు, స్పెషల్ జువెనైల్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించాలి

మేజిస్ట్రేట్ కె.లత



నల్లపాడు పీఎస్ సీఐకు ప్రశంసా పత్రం అందిస్తున్న ఎస్పీ, మేజిస్ట్రేట్

నగరంపాలెం: పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించాలని మేజిస్ట్రేట్ కె.లత పోలీస్ అధికారులకు తెలిపారు. ఇటీవల కొత్త చట్టాలు అమలవుతున్నాయని, కేసుల నమోదులో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని సమావేశ మందిరంలో శనివారం పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. వారెంట్లు ఎల్‌పీసీ పెండింగ్ తదితర కేసుల పరిష్కారం గురించి మేజిస్ట్రేట్ కె.లత వివరించారు. కేసులను ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించి, సంఖ్య తగ్గించాలని పేర్కొన్నారు. కేసుల దర్యాప్తుల్లో పాటించాల్సిన మెలకువలను తెలియజేశారు. ఇటీవల లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ వేగవంతం చేయాలని సూచించారు. రౌడీషీటర్లను స్థానిక ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద రూ.5 లక్షల పూచీకత్తుతో బైండోవర్ చేయించాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, డీఎస్పీలు అబ్దుల్ అజీజ్ (తూర్పు), జయరాం ప్రసాద్ (పశ్చిమ) మురళీకృష్ణ (మంగళగిరి), బి.సీ తారామయ్య (ఎస్‌బీ), సుబ్బారావు (మహిళా పీఎస్), శివాజీరాజు (సీసీఎస్), శాంతకుమార్ (ఏఆర్), సీఐలు, ఆర్‌ఐలు, ఎస్పీ సీసీ ఆదిశేషు పాల్గొన్నారు.

ప్రభుత్వం హామీలను వెంటనే అమలుచేయాలి



ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికుల సంఘం నేతలు

లక్ష్మీపురం: భవన నిర్మాణ కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదరిశ దండా లక్ష్మీనారాయణ కోరారు. తూర్పు శాసన సభ్యుడు నసీర్‌అహ్మద్‌ను శనివారం భవన నిర్మాణ కార్మికులు, సీఐటీయూ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉచిత ఇసుక హామీని అమలుచేయాలని కోరారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ ఫలాలు కార్మికులకు అందించాలని విన్నవించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు అవుతున్నా నేటికీ హామీలు అమలు కాలేదని విమర్శించారు. యూనియన్ నగర గౌరవాధ్యక్షులు కట్లకుంట శ్రీనివాసరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు వారంలో రెండు మూడు రోజులు మాత్రమే పని దొరుకుతోందని, కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనికి తోడు రాజధాని నిర్మాణంలో స్థానిక కార్మికులకు ప్రాధాన్యత లేకపోవడంతో ఉపాధి కరువైందని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల్ని వచ్చే నెలలో జరిగే శాసనసభలో ప్రభుత్వం ముందు పెట్టాలని ఎమ్మెల్యేను కోరారు . కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగాతి సత్యనారాయణ, యూనియన్ తూర్పు, పశ్చిమ ప్రధాన కార్యదర్శులు దీవెనరావు, యస్‌కే ఖాసింవలి, దొడ్డా కోటేశ్వరరావు, మైల ముత్యాలరావు, పోలే విమల్‌కుమార్, నజీర్ ,చంటి,రంగా, నక్క మస్తాన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలో మనీషా ప్రతిభ



మనీషాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: హిందూపురంలో ఇటీవల జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి బాలికల వాలీబాల్ టోర్నమెంట్‌లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి. సునీత తెలిపారు. సాంబశివపేటలోని కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కు గుంటూరు జిల్లా తరఫున పోటీ పడిన టీం ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. టీంలో తమ కళాశాల జూనియర్ ఇంటర్ సీఈసీ విద్యార్థిని బి. మనీషా ప్రాతినిధ్యం వహించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాల అధ్యాపకురాలు వై. సునీతారాణి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త మాధవీలత అభినందించారు.

తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం

ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశం



పైపులైన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారుల్ని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. పైప్‌లైన్లలో ఇబ్బందులు తలెత్తితే వెంటనే యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి, ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. ఆయన శనివారం ఎస్‌వీఎన్ కాలనీ, హౌసింగ్ బోర్డ్, బ్రాడీపేట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ పరిశీలించారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఎస్‌వీఎన్ కాలనీలో గత కొన్ని రోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా జరగడంలేదన్న స్థానికుల ఫిర్యాదు మేరకు ఇంజినీరింగ్ అధికారుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మోటార్లు మరమ్మతు వల్ల సమస్య ఏర్పడిందని తెలియజేయడంతో ఇంజినీరింగ్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి సరఫరాని అధిక ప్రాధాన్యంగా పరిగణలోకి తీసుకోవాలని, నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మోటార్ మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని ఆదేశించారు. ఎస్‌వీఎన్ కాలనీ మెయిన్ రోడ్‌ని ఎన్ క్యాప్ నిధులతో ఎండ్ టూ ఎండ్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. డ్రెయిన్ల శుభ్రం చేయడంలేదన్న ఫిర్యాదు మేరకు గ్యాంగ్ వర్క్ ద్వారా వెంటనే శుభ్రం చేయాలని ప్రజారోగ్య అధికారుల్ని ఆదేశించారు. హౌసింగ్ బోర్డ్ కాలనీలో యూజీడీ లైన్లు పూర్తి స్థాయిలో వినియోగంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏఈని ఆదేశించారు. కాలనీలో పలు ప్రాంతాల్లో వర్షం నీరు వెళ్లడానికి కల్వర్ట్‌లు సరిగా లేక పోవడం గమనించారు. నూతన నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈకి చెప్పారు. ఖాళీ స్థల యాజమానులకు నోటీసులు ఇచ్చి శుభ్రం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. బ్రాడీపేటలోని మున్సిపల్ పార్క్, వాకింగ్ ట్రాక్‌ని పరిశీలించారు. పార్క్‌లో ముఖ్యమైన అభివృద్ధి పనుల్ని జీఎంసీ చేపట్టిందని, నిర్వహణను స్థానిక వాకర్స్ అసోసియేషన్ బాధ్యత తీసుకోవాలని కమిషనర్ సూచించారు. పార్క్ పరిసరాల్లో నిర్మాణ వ్యర్థాలు లేకుండా పట్టణ ప్రణాళిక కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్లు వి.శ్రీరామ్ ప్రసాద్, సుబ్బారెడ్డి, రోషన్, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈ సుందరరామిరెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, రామారావు, ఏసీపీలు, ఆర్వోలు డీఈఈలు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు సహకరించాలి

నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని కమిషనర్ కోరారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో శనివారం వీధి కుక్కల నియంత్రణ, సమస్యలు, పరిష్కార మార్గాలపై వివిధ జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జీఎంసీ ప్రభుత్వ పశువైద్య విభాగ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కమిషనర్ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కలకు యాంటీ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కోసం ఏటుకూరు రోడ్‌లో ప్రత్యేక సెంటర్‌ని ఏర్పాటు చేశామని తెలిపారు. అందులో స్నేహ యానిమల్ వెల్ఫేర్ సంస్థ ఏబీసీ చేస్తుందన్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు, జంతు ప్రేమికులు ఏబీసీ నిర్వహణపై పలు ఫిర్యాదులు చేస్తున్నారని, సదరు ఏజన్సీ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని కమిషనర్ స్పష్టం చేశారు.ఏ ప్రాంతంలో పట్టుకున్న కుక్కను ఆపరేషన్ అనంతరం అదే ప్రాంతంలో వదలాలని, ముందు, తర్వాత స్థానికుల సంతకాలు తీసుకోవాలని ఏజెన్సీ ప్రతినిధులకు తెలిపారు. సమావేశంలో సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్‌ఓలు డాక్టర్ రవిబాబు, రామారావు, బయాలజిస్ట్ మధుసూదన్, ప్రభుత్వ పశువైద్య శాఖ నుంచి డీడీ రత్నజ్యోతి, ఏడీ నాగేశ్వరరావు, ఏవీఎస్ ఈశ్వరరెడ్డి, వివిధ స్వచ్ఛంద సంస్థల, జంతు ప్రేమికులు పాల్గొన్నారు.

స్వయం సహాయక గ్రూప్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

నగరంలో వార్డ్ సచివాలయాల వారీగా నూతన స్వయం సహాయక గ్రూప్ లను ఏర్పాటుకు మెప్మా సీఎంఎం, సీఓలు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం మెప్మా(ఉపా సెల్), పరిపాలన, లీగల్ సెల్ విభాగాల సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.కమిషనర్ మాట్లాడుతూ ప్రతి శనివారం జరిగే సమావేశంలో నూతన గ్రూప్‌ల ఏర్పాటుపై ప్రత్యేక సమీక్ష చేస్తామని తెలిపారు. నగరంలోని హిజ్రాలతో ప్రత్యేకంగా స్వయం సహాయక గ్రూప్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి నెలా తూర్పు నియోజకవర్గంలో శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం, పశ్చిమ నియోజకవర్గంలో ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో మెప్మా బజార్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. న్నారు. కోర్ట్ తీర్పులను సత్వరం అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్.ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, మెప్మా పీఓ రామారావు, సూపరింటెండెంట్లు పద్మనాభరావు, బాలాజీ బాష, మదన్ గోపాల్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం



విజేతలకు ట్రోఫీ ప్రదానం చేస్తున్న భాష్యం రామకృష్ణ, హనుమంతరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసానికి దోహదం చేస్తాయని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. రింగ్ రోడ్డులోని భాష్యం బ్లూమ్స్ సెకండరీ క్యాంపస్‌లో స్పోర్ట్స్‌మీట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించి, ఎంచుకున్న రంగంలో ఉన్నతస్థాయికి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ముందుగా స్పోర్ట్స్ మీట్, భాష్యం బ్లూమ్స్ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రీడా విన్యాసాలతో అలరించారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ భాష్యం హనుమంతరావు, బ్లూమ్స్ ప్రైమరీ, సెకండరీ క్యాంపస్‌ల ప్రిన్సిపాల్స్ కవిత, గిరిజారాణి, జెడ్ఈవో వేరలక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ టోర్నీలో సత్తా చాటిన విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న విష్ణువర్ధన్, కృష్ణవేణి, సుబ్బారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఓపెన్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో తమ విద్యార్థులు సత్తా చాటారని పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డెక్కన్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తమ పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈనెల 18,19,20వ తేదీల్లో ఓపెన్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలిపారు. బాలికల విభాగంలో 8,9,10 తరగతుల విద్యార్థినులు నిహారిక, చరిత, సహస్ర, శరణ్య, అక్షయ, సుధారాణి తృతీయ స్థానంలో నిలిచారని వివరించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, అత్తోట సుబ్బారావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ప్రత్తిపాడు: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వట్టిచెరుకూరు సీఐ రామానాయక్ సూచించారు. పోలీసు అమరవీరుల స్మారకోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు 'సైబర్ నేరాలు అరికట్టడంలో యువత పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఆసక్తి గా పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను సీఐ రామానాయక్ అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.